క్లుప్తంగా

మాయమైన విగ్రహాలు లభ్యం



స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

చింతలపూడి : మండలంలోని రేచర్ల పంచాయతీ రెండో మైలు తండా వద్ద ఉన్న రామాలయంలో మాయమైన విగ్రహాలను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాగిరెడ్డి గూడెం ప్రాజెక్ట్ సమీపంలో పడి ఉన్న విగ్రహాలను గుర్తించామని ఎస్సై కె.సతీష్ కుమార్ తెలిపారు. రేచర్ల తండాకు చెందిన ధరావతు దీప్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విగ్రహాలను మాయం చేసిన దారావతు బాలు, దారవతు మంగమ్మ, దారవతు కృష్ణ మూర్తిలను సీఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

చింతలపూడి : తమ సమస్యలను పరిష్కరించాలని సాంఘిక సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దంతినపల్లి సూరయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్‌కు ముగ్గురు సిబ్బందిని నియమించాలని, వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగులకు ప్రతి వారంలో ఒకసారి వీక్లీ హాఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్రరావు దృష్టికి తీసుకెళతామని, త్వరలోనే అధికారులను కలిసి పరిష్కారానికి చర్యలు తీసుకుందాటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కమిటీ ఎన్నిక





గిల్లబత్తిన వెంకటేశ్వర్లు   బద్దె ప్రేమ్ కుమార్

జంగారెడ్డిగూడెం: మండలంలోని తాడువాయి పంచాయతీ చల్లవారిగూడెం గ్రామ పరిధిలోని పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసిత కాలనీ కమిటీ ఎన్నిక శుక్రవారం 12 గ్రామాల ప్రజల సమక్షంలో నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడిగా గిల్లబత్తిన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గుబ్బల విజయ్ బాబు, సెక్రటరీగా బద్దె ప్రేమ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బద్దె ప్రేమ్‌కుమార్, పెరుమాళ్ల శ్రీను, దాసు, వరక విశ్వనాథం, మల్లికార్జునరావు, బండి శ్రీను, ఉమా దేవి, మెండం డేవిడ్, వలపర్ల రవి తదితరులు ఉన్నారు.

నూకాలమ్మ వెండి చీరకు విరాళం



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ వెండి చీర నిర్మాణానికి దాతలు చింతా నాగరాజు, నాగమణి దంపతులు రూ.10,116, పోలుపర్తి కన్నారావు, విజయలక్ష్మి దంపతులు రూ.5,116లు, శ్రీనివాస బయో మెరైన్ కూరాకుల శ్రీనివాసరావు, రమ్యశ్రీ దంపతులు (నిడమర్రు) రూ.5,116 అందజేశారని ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశామన్నారు. జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ, గుర్వాయిగూడెం అయ్యప్ప ఉపాలయమైన జ్ఞాన సరస్వతి ఆలయాల్లో అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రొటీన్ పౌడర్ పంపిణీ

బుట్టాయగూడెం: మండలంలోని నందాపురం పీహెచ్‌సీలో సుమారు 20 మంది గర్భిణులకు ప్రొటీన్ పౌడర్‌ను రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సరిత ఆస్పత్రి అధినేత డాక్టర్ వందనపు ప్రేమ్‌చంద్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండేపాటి రామకృష్ణ, వి.పెద్దిరాజు, పి.వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే

లింగపాలెం: మండలంలో భూ రీసర్వే కొనసాగుతోంది. భూ రీసర్వే ఫేజ్-3లో భాగంగా ములగలంపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాన్ని శుక్రవారం తహసీల్దార్ నజముల్లాషా పరిశీలించి, సూచనలు చేశారు. రీ సర్వే డీటీ నాగబాబు, ఎంఆర్ఐ ఎన్ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

ఉచితం పేరుతో అదనపు భారం

- ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో అల్ట్రా డీలక్సులు
- వర్తించని ఉచిత బస్సు పథకం
- విలీన మండలాల్లో నిర్వాసిత మహిళల ఆవేదన



కుక్కునూరు మీదుగా భద్రాచలం నడుపుతున్న అల్ట్రా డీలక్స్ బస్సు

కుక్కునూరు: ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఆర్థిక భారం తగ్గించే దిశగా అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న మాదిరిగా తయారైంది. ఎన్నికలకు ముందు కూటమి పార్టీల నాయకులు తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేసి వారిపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తామని ప్రకటించారు. అధికారం చేపట్టిన ఏడాది తరువాత ఆగష్టు 15న ప్రభుత్వం ఆర్భాటంగా ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించింది. విలీన మండలాలకు అటు, ఇటు తెలంగాణ గ్రామాలు ఉండడం అంతర రాష్ట్ర సర్వీసులకు ఈ పథకం వర్తించకపోవడంతో పథకం ప్రారంభంలో నిర్వాసితులు కొంతమేర ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ఈ విలీన మండలాల గుండా వెళ్లే బస్సులను అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక వరకు ఉచిత పథకం వర్తించేలా చర్యలు చేపట్టారు. దీంతో నిర్వాసితులు ఎంతో సంతోషపడ్డారు. కానీ ఆ సంతోషం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. కేవలం ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సులకే పరిమితం చేశారు.

చార్జీలు చెల్లించాల్సిందే!

ఉచిత పథకం అమలుతో రాజమండ్రి, జంగారెడ్డి గూడెం డిపోల నుంచి కుక్కునూరు మీదుగా భద్రాచలం వరకు నడిపే అన్ని ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు సర్వీసులను చాలావరకు తగ్గించేశారు. వీటి స్థానంలో అల్ట్రా డీలక్స్ బస్సులు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉచిత బస్సు పథకం వర్తించడంలేదు. చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తోందని నిర్వాసిత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క ఉచితం అంటూనే ప్రభుత్వం తెలివిగా అదనపు వసూళ్లకు పాల్పడుతూ నిర్వాసితులను నిలువుదోపిడీ చేస్తోందని వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో ఇప్పటికే నిర్వాసితులకు పరిహారం అందించకుండా నానా ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వం తమ పట్ల ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడపాలి



ప్రభుత్వం ఉచిత బస్సు పేరుతో నిర్వాసిత మహిళలపై అదనపు భారం మోపడం దారుణం. ఇది నిర్వాసిత మహిళలను మోసం చేయడమే. నిర్వాసిత మహిళలకు న్యాయం చేయాలి. గతంలో మాదిరిగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను కుక్కునూరు భద్రాచలం రూట్లలో నడపాలి.

– కొన్నె జయశ్రీ, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సంఘం, మండల అధ్యక్షురాలు, కుక్కునూరు

ప్రజలపై భారం



కుక్కునూరు నుంచి భద్రాచలం వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో చార్జీ రూ.70. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల స్థానంలో అల్ట్రా డీలక్స్‌లను నడుపుతూ భద్రాచలం వరకు రూ.85 వసూలు చేస్తున్నారు. అంటే గతంలో కంటే ఎక్కువ ఖర్చు చేసి భద్రాచలం వెళ్లాల్సి వస్తుంది. ప్రజలపై భారం మోపడం సరికాదు.

– వరకా శ్యామల, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, జిల్లా కార్యదర్శి

ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలి



సభలో మాట్లాడుతున్న రవి

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో రూ.2.50 లక్షల కోట్లు కేటాయించి అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పట్టిన్నపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం 12వ మండల మహాసభలు జోడే సూర్యచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం జెండాను కమిటీ సభ్యురాలు పూసం దర్గా ఎగురవేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, కరువుల వెంకటలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎ.రవి, రాష్ట్ర ఉపాధ్యక్షురా లు తామ ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్షుడు ఎం జీవరత్నం మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పనులు కల్పించి, రూ.800 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, వీధిలైట్లు, శ్మశాన సమస్యలన్నీ పరిష్కరించాలని ఎమ్మెల్యే కు విన్నవించినా ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాగంటి సీత, అందుగుల ప్రభాకర్‌రావు, ఎం.బాలరాజు, కె.సుబ్బారావు, వి.నరసరావు పాల్గొన్నారు.

కదలనున్న ‘కూటమి’ పునాదులు

మాజీ ఎమ్మెల్యే బాలరాజు



కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: కోటి సంతకాల ప్రజా ఉద్యమంతో కూటమి పునాదులు కదలబోనున్నాయని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం బయ్యనగూడెంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ఏర్పాటుచేసిన రచ్చబండ సమావేశంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ ముఖ్యఉద్దేశాన్ని బాలరాజు వివరించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్య విద్యను పేదలకు అందే విధంగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసి, అందులో ఐదు కళాశాలలను కూడా ప్రారంభించామని చెప్పారు. అయితే కూటమి నేతల దుష్ప్రచారంతో ప్రభుత్వం కోల్పోవడం, ఆపై కూటమి నేతలు వైద్య కళాశాలలను (పీపీపీ) పబ్లిక్ ప్రైవేటు ప్రాపర్టీ పేరిట ప్రైవేటు పరం చేయడం ఆంధ్ర రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యంగా మారిందన్నారు. దీంతో కోట్లాది రూపాయలు వైద్య విద్యకు ఖర్చు చేయాల్సిన దుస్థితి వైద్య విద్యార్థులకు శాపంగా పరిగణిస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటైన ఏడు సీ పోర్టులను కూడా ప్రైవేటు పరం చేసి రాష్ట్ర భవిష్యత్తును కూటమి ప్రభుత్వం అంధకారంగా చేయనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో సంతకాల సేకరణ చేయాలని అన్నారు. అమరావతిలోని రైతుల భూములను సీఆర్‌డీఏ పేరిట స్వాధీనం చేసుకోవడం, వాటిని కార్పొరేట్ సంస్థలకు విక్రయించుకోవడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని వివరించారు.

పథకాల్లో కోత

రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది ఆటోవాలాలు ఉండగా కేవలం రెండు లక్షల మందికే రూ.15 వేల పథకం అమలు చేశారని, అమ్మ ఒడి, రైతు భరోసా, పెన్షన్లు వంటి వాటిలో భారీ కోతలు విధించి వారి జీవితాలను అథోగతి పాలు చేశారని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులను, సానిభూతిపరులను గెలిపించుకోవడానికి ప్రజలు ఆత్రుతతో ఎదురుచూస్తున్నారని, ఈ నేపథ్యంలో కూటమి పాలనకు బుద్ధి చెప్పాలని పిలుపు ఇచ్చారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీపీ గంజిమాల రామారావు, సర్పంచ్ ఎల్ అనంతలక్ష్మి, పార్టీ నాయకులు బిరుదుగట్ల ప్రేమ్‌కుమార్, చిటికెన శ్రీను, కంభంపాటి బుజ్జిబాబు, బాలం వెంకటరామయ్య, నూకల రాము, మారిశెట్టి శ్రీను, దూలపల్లి కాంతారావు, ఎస్‌కే మస్తాన్, ఎస్‌కే బాజీ, సీహెచ్ రవి, ఎం.పరమేష్, టి.బ్రహ్మన్న, ఎం.ప్రసన్న, పి.రాంబాబు, నమ్మిన రాజు, యు.నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు



పదోన్నతులు పొందిన వారికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎస్‌జీటీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఐదుగురికి పదోన్నతులు కల్పించినట్టు ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. గురువారం పదోన్నతుల నియామక ఉత్తర్వులను వారికి అందజేశారు. మొడియం జయలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ (బైలాజికల్ సైన్స్)గా మర్రిగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలకు నియమించినట్టు చెప్పారు. మల్లం వెంకటలక్ష్మి కామయ్యకుంట స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా, బక్క నాగమణిని వేలేరుపాడు బాలికల ఆశ్రమ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్)గా, మడకం సత్యనారాయణ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడుగా బోడిగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలకు పదోన్నతిపై నియమించినట్టు తెలిపారు. రావుల వెంకటేశ్వరరావు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు పదోన్నతిపై నియమించామన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు 311 మంది విద్యార్థులు



డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీవైఈఓ సుధాకర్, పీఈటీలు

చింతలపూడి : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు అండర్-14, -17 బాల బాలికలకు నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్ మొదలైన క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. 16 పాఠశాలల నుంచి 650 మంది బాల బాలికలు హాజరయ్యారని నూజివీడు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పీఎస్ సుధాకర్ తెలిపారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించిన 311 మందిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. వీరు ఏలూరు డివిజన్లో నిర్వహించే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఎంఈఓ సందిపాం కిరణ్ బాబు పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ శ్రీపిట్ట వేణు, అల్లూరి గిరిరాజు, సొంగా సుందరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయురాలు పి.జయలక్ష్మి, మండల కోఆర్డినేటర్ శీమాన్, యూసఫ్, ప్రసాద్, రాణి, రాజు, శ్రీతల్లి, వెంకటలక్ష్మి, అరుణ, పీఈటీలు పాల్గొన్నారు.

13 నుంచి ఐద్వా రాష్ట్ర మహాసభలు



జెండా ఆవిష్కరణ చేస్తున్న శ్యామల రాణి

జంగారెడ్డిగూడెం: అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి కోరారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయం ఆమె ఐద్వా పతాక ఆవిష్కరణ చేశారు. సభలకు జాతీయ నాయకులు, రాష్ట్రం నలుమూలల నుండి 600 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని శ్యామల రాణి తెలిపారు. 13వ తేదీన భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. సభల్లో మద్యం, డ్వాక్రా సమస్యలు, మైక్రో ఫైన్ సమస్యలపై చర్చిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వై.సీత, మానుకొండ కుమారి, గోసాల మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి పిలుపు ఇచ్చారు. శుక్రవారం అశోక్ నగర్ మత్స్యకారుల వీధిలో గేదెల నాగులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాగులు జెండా ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ నాయకులు ఎస్ రాంబాబు, కె.సూర్య కుమారి, ఎ.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి పెదపాడు మండలం నాయుడుగూడెంకు చెందిన గారపాటి సాంబమూర్తి శుక్రవారం రూ.1,11,000 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ అధికారులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. తొలుత దాత కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రేపు కృత్రిమ కాళ్ల స్క్రీనింగ్

జంగారెడ్డిగూడెం: స్థానిక లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో కృత్రిమ కాళ్ల స్క్రీనింగ్ శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. ఏలూరు హేలాపురి లయన్స్‌క్లబ్, జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగుల కొలతలు తీసుకుని కృత్రిమ అవయవాలు అందజేస్తామని తెలిపారు.

జీఎస్టీ 2.0పై ర్యాలీ

జంగారెడ్డిగూడెం: జీఎస్టీ 2.0 ద్వారా కలిగే ప్రయోజనాలు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జీఎస్టీ 2.0 అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వాహన రహిత రోజు

కాలుష్య నివారణలో భాగంగా కళాశాలలో వాహన రహిత రోజు కార్యక్రమం నిర్వహించారు. ఐక్యూఏసీ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కోఆర్డినేటర్ ఎం మధు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శుక్రవారం నాడు కళాశాలలో వాహన రహిత రోజు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

వరల్డ్ మెంటల్ హెల్త్ డే



వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏపీసీ పంకజ్ కుమార్, జీసీడీఓ బి.నవీన ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయురాలు ఎం కౌశల్య ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన కల్పించారు. సుధీర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని పెంచుకోవాలన్నారు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ, సత్ప్రవర్తన అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలరాయనగూడెంలో..

లింగపాలెం: మానసికంగా ఎవరైతే ఆరోగ్యంగా, స్థిరంగా ఉంటారో వారికి అనారోగ్యాలు దరిచేరవని కలరాయనగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు అన్నారు. మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలరాయనగూడెం హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులు వ్యాయామం, ఆటలు, యోగ, మంచి సంగీతం, సానుకూలంగా ఆలోచించటం, పెయింటింగ్ వంటివి అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాములకు భిక్ష



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలో భిక్షను స్వీకరిస్తున్న మాలాధారణ స్వాములు



కామవరపుకోట: అన్నదాన కమిటీ సభ్యులతో పూర్వ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో స్వాములకు భిక్ష కొనసాగింది. శుక్రవారం 9వ రోజు కార్యక్రమానికి దాతలుగా జంగారెడ్డిగూడెంకు చెందిన కేతినేని గురువారెడ్డి, లక్ష్మి దంపతులు వ్యవహరించినట్టు ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి, సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి, కోశాధికారి కూనపారవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో..

కామవరపుకోట: స్థానిక శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి ఆలయంలో స్వాములకు శుక్రవారం 8వ రోజు భిక్ష కార్యక్రమాన్ని 1994-95వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించామని వీరభద్ర అన్నదాన కమిటీ సభ్యుడు కడిపి పాపారావు తెలిపారు. వాకచర్ల ప్రసాద్, బుచ్చిబాబు, నలనల్లమోతుల సత్యనారాయణ, కానూరి భద్రరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

10 గంటల విధానంతో శ్రమ దోపిడీ

జంగారెడ్డిగూడెం: కార్మికుల శ్రమ శక్తిని మరింత దోచుకోవడానికి 10 గంటల పని విధానం తీసుకొచ్చారని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ విమర్శించారు. ఇఫ్టూ జంగారెడ్డిగూడెం పట్టణ కమిటీ సమావేశం యడ్లపల్లి బుజ్జియ్య అధ్యక్షతన శుక్రవారం ధర్మన్న స్మారక భవనంలో నిర్వహించారు. రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రం మేప్పు కోసం 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటల పని విధానం తీసుకువచ్చిందన్నారు. సమావేశంలో మంచిలి రాజు, మొల్లేటి శ్రీనివాస్, ఎం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సైకిళ్లకు నీడ కరువు



పాఠశాలలో ఆరుబయట ఎండలో ఉన్న సైకిళ్లు

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైకిళ్లకు నీడనిచ్చేందుకు షెడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా పాఠశాలకు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు సైకిల్ షెడ్డు లేక ఎండకు ఎండి, వర్షానికి సైకిళ్లు తడుతున్నాయని విద్యార్థులు ఎన్నో విజ్ఞప్తులు చేసినా ఫలితంలేదు. పాఠశాలలో కొత్త భవన నిర్మాణాలు చేస్తున్నారే తప్ప సైకిళ్ల షెడ్డు కూడా నిర్మించకపోవడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎండకు ఎండి, వర్షానికి తడవడంతో తరచూ సైకిళ్లు మరమ్మతులకు గురవుతున్నాయని వారు వాపోతున్నారు. పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. నిత్యం దూర ప్రాంతాల నుంచి బాల బాలికలు సుమారు 300 మంది సైకిళ్లపై పాఠశాలకు వస్తుంటారు. పాఠశాల గ్రౌండ్‌లో ఆరు బయట సైకిళ్లు పెట్టి సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత తిరిగి వెళుతుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిస్తే వర్షంలో, లేదా ఎండలో ఉండాల్సిందే. ఇప్పటికైనా సైకిల్ షెడ్డు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన రవాణా శాఖ



షేక్ కరీమ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వాహన తనిఖీలపై నెలకు రూ.85 లక్షలు చొప్పున గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.5.10 కోట్లు ఏలూరు జిల్లాకు లక్ష్యం కాగా, రూ.5.80 కోట్లను సాధించామని ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ శుక్రవారం తెలిపారు. 8,821 కేసులు నమోదు చేసి 114 శాతం లక్ష్యాన్ని సాధించామని చెప్పారు. ఇందులో ఫిట్నెస్ లేనందుకు 1,018 కేసుల ద్వారా రూ.24,83,000, పర్మిట్ లేనందుకు 374 కేసుల ద్వారా రూ.36,36,300, పన్ను చెల్లించనందుకు 2,273 కేసుల ద్వారా రూ.18,76,600, డ్రైవింగ్ లైసెన్స్ లేని 1,349 కేసుల్లో రూ.33,10,200, హెల్మెట్ ధరించని 1,319 కేసుల్లో రూ.10,90,000, వాహన ఇన్సూరెన్స్ లేని 1,357 కేసుల్లో రూ.27,48,000 అపరాధ రుసుము విధించామని వివరించారు. జిల్లాలోని మోటారు వాహన తనిఖీ అధికారులందరూ సమష్టిగా తనిఖీలు చేయడం వల్లే లక్ష్యాన్ని సాధించగలిగామని కరీమ్ తెలిపారు.